# "తల్లి దండ్రుల" స్వభావాలు

యం. జానకీరాణి

రేణుక తన అక్కగారైన సీతాలక్ష్మి యింట్లో వుంటూ, బి.యల్. క్లాసు చదువుతోంది. ఒక నాటి సాయంకాలం కాలేజీలో జరుగబోయే సాహిత్యగోష్ఠికి వెడదామని ఆమె బయలుదేరింది. తీరా నాలుగైన తర్వాత సీతాలక్ష్మి కూతురు లత తనుకూడా వస్తానని పేచీ పెట్టింది. అక్కడ ఉపన్యాసాలు తప్పితే యింకేమీ వుండవని ఎన్ని విధాలో చెప్పారు రేణుక, సీతాలక్ష్మి కలిసి. కానీ ఎనిమిదేళ్ళ లతకి అవేమీ పనికిరాలేదు. పెద్ద రాగం తీయడం మొదలుపెట్టింది.

చివరకు—ముస్తాబులు పూర్తి చేసుకుని ఐదు గంటలకి బయలుదేరారు రేణుకా, లతా. బస్ దిగి గేటులో ప్రవేశించడంతోనే విద్యార్థి సమితి కార్యదర్శి కృష్ణమూర్తి ఎదురై, నమస్కారం చేశాడు.

"ఈరోజు ప్రార్థన మీరు పాడాలండి" అన్నాడు. రేణుక ఎల్లాగూ అనుకుంటూనే వచ్చింది కాబట్టి, గాభరా పడకుండా చిరునవ్వుతో అంగీకరించింది.

"యాకున్దేన్దు" రాగమాలికలో అద్భుతంగా పాడేసింది రేణుక. ఎఱ్ఱంచు తెల్లని క్రేపుచీర కట్టుకుని, పెద్ద కుంకుమబొట్టు ధరించిన రేణుక అచ్చం లక్ష్మీదేవిలాగా చాలా మందికి గోచరించిందంటే ఆశ్చర్యంలేదు. మీటింగు చివరికి వచ్చే వరకు నిశ్శబ్దంగా, అందరివంక చూస్తూ కూచుంది లత. అంత ఓపిగ్గా కూర్చున్నందుకు లతను ఎన్ని విధాలో దీవించింది రేణుక.

మీటింగు ఐపోయి వచ్చేస్తుంటే, కృష్ణమూర్తి కనిపించి కృతజ్ఞతలు, అభినందనలు అందచేశాడు. బస్ స్టాండుదాకా వచ్చాడతను ఏవో మాట్లాడుతూ. లతవంక చాలాసేపు చూశాడు కృష్ణమూర్తి. ఒక పూలగుత్తికూడా బహూకరించాడామెకి.

హఠాత్తుగా మాటమార్చి, రేణుకవంక చూస్తూ, "మీ అమ్మాయా అండీ?" అన్నాడు కృష్ణమూర్తి.

రేణుకకి అర్థంకాలేదు అతనడిగిందేమిటో. ఆమె ముఖం మీది ఆశ్చర్యభావం చూసి—

"మీ కూతురా అని అడుగుతున్నానండీ!" అన్నాడతను లతవంక చూపిస్తూ. రేణుక ఒక్క క్షణం నిర్ఘాంతపోయింది. మరుక్షణంలో ఆమె బుగ్గలు ఎఱ్ఱబడటం, చేతిరుమాలుతో పెదవులద్దుకోవడం జరిగిపోయాయి.

ఊపిరిబిగబట్టి "కాదండి." అన్నదామె. ఇంతలోనే బస్ వచ్చింది.

"వస్తానండి. నమస్కారము" అంటూ వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి. రేణుక లోపల్లోపల మండిపోతోంది. దుర్భరావమానం చేశాడే యీ దుర్మార్గుడు అనుకుంది.

ఎనిమిదేళ్ళ లత—తనలో సగంవున్న లత తన కూతురా? ఓ నిముషం లత వంక చూసి ముఖం అవతలకి తిప్పుకుంది రేణుక.

ఏమనుకుని అల్లా అడిగాడు కృష్ణమూర్తి? తనని అవమానించే ఉద్దేశంతోనే అడిగాడు. తను 'మిస్' అన్న సంగతి యీ రెండేళ్ళలో గమనించనేలేదా? హూ! పళ్లు కొరుక్కుంది రేణుక. ఇంటికి చేరేవరకూ ఆమె గందరగోళ పడిపోయింది.

ఇంట్లోకి వెడుతూనే జరీచెప్పులు ఓ మూల విసిరేసి, పడక్కుర్చీలో వాలిపోయింది. మోగుతున్న రేడియోని తక్కున ఆపేసింది. హేండ్ బేగ్ బల్లమీదికి విసిరేసింది.

లత మాత్రం పకపకలాడుతూ లోపలికి పరుగెత్తింది. వెళ్ళి వాళ్ళ అమ్మతో ఏం చెప్పిందో కానీ సీతాలక్ష్మి వెంటనే హాల్లోకొచ్చింది.

"ఏమిటి రేణూ, ఎవరో ఏమిటో అడిగాడుటగా నిన్ను?" రేణుక చివాలున లేచికూర్చుంది.

"అక్కయ్యా, నాకు ఇరవై రెండో ఏడు నిండిందా అసలు?"

"లేదులే కానీ, లత నీ కూతురా అని అడిగాడుటగా? ఎవరతను?" అంది సీతాలక్ష్మి కూచుంటూ.

"ఎవడో లే! నాకు ఎనిమిదేళ్ళ కూతురుంటుందని ఎల్లా అనుకున్నాడు? నేనంత ముసలిదానిలాగా

కనిపించావా అతగాడి కళ్ళకి? ఛీ! ఇన్నాళ్లు!" అన్నది రేణుక. ఓ నిముషం నేలవంక చూసి చటుక్కున సీతాలక్ష్మివంక తిరిగింది.

"ఈ గాడిదని తీసికెళ్ళడంతో వచ్చింది నాకీ చిక్కు. వద్దు మొర్రో అంటే విన్నది కాదు... అసలు ఏ వుద్దేశంతో అడిగాడూ అని అంత చవట ప్రశ్న? నన్ను అవమానం చెయ్యాలనేగా! వాట్ డస్ హి మీన్!"

"పోనీలేవే. పధ్నాలుగేళ్ళకి పెళ్ళిచేస్తేయింత కూతురు వుండకూడదా ఏమిటి? దాన్ని గురించి అంత మధనపడడం దేనికి!" అన్నది సీతాలక్ష్మి.

"ఏమీలేదు. నేను 'మిస్' అన్న సంగతి తెలియకుండానే వుందా యిన్నాళ్ళూ? ఆడపిల్లల పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుస్తాయి—యీ బుద్ధాయిలకి. నాకు పెళ్లయిందో లేదో తెలియదా? సరే, చూద్దాంగా" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది రేణుక. ఆ రాత్రి ఆమెకి నిద్రపట్టలేదు — కోపంతో, అర్థంలేని అవమాన భారంతో.

ఆ తర్వాత కృష్ణమూర్తి చాలా సార్లు కనుపించాడు రేణుకకి. కానీ ఎంత ప్రయత్నించినా అతనితో కులాసాగా మాట్లాడలేక పోయింది. లతనిమాత్రం ఎక్కడికీ తీసుకువెళ్ళనేసి అక్కయ్యకి ఖచ్చితంగా చెప్పేసింది ఆమె.

ఒకనాటి సాయంకాలం మెరీనాబీచ్‌కి వెళ్లారు సీతాలక్ష్మి, రేణుకా. లత వాళ్ళ నాన్నగారితో సినిమాకి వెళ్ళింది. కేంటీన్‌లో డాబామీద చల్లగాలిలో కూర్చున్నారిద్దరూ. ఐస్‌క్రీం తింటూ సముద్రంవంక చూస్తోంది రేణుక.

వెనకాల పరిచితమైన కంఠం వినిపించేసరికి తిరిగి చూసింది ఆమె. కృష్ణమూర్తి ఒక పద్ధెనిమిదేళ్ళ యువతితో వస్తున్నాడు. మెట్లు ఎక్కేసి, తల యెత్తగానే రేణుక కనిపించింది అతనికి. రేణుకకి చటుక్కున మెరపులా తోచింది ఒక ఆలోచన.

"అక్కయ్యా, అతనే!" అని మెల్లిగా సీతాలక్ష్మి చెవిలో వూదింది.

కృష్ణమూర్తి నమస్కారంచేసి, దగ్గరకొచ్చాడు. అతనితోవున్న అమ్మాయి అందంగావుంది. ఆమెను పరిచయం చేయకుండానే ఏవేవో మాట్లాడాడు కృష్ణమూర్తి. ఐస్‌క్రీం కప్పులు తీసుకుని వచ్చిన వెయిటరుని పిల్చి, ఆ బల్లమీదే పెట్టించాడు. కృష్ణమూర్తి ఆ అమ్మాయిని కూర్చోమని ఆదేశించి, తాను కుర్చీలాక్కుని కూచున్నాడు. సీతాలక్ష్మిని పరిచయంచేసింది రేణుక.

రేణుక బుర్ర తీవ్రవేగంతో పనిచేస్తోంది. హఠాత్తుగా ధోరణిమార్చి, ఎంతో ధైర్యం కూడగట్టుకుని, తొణక్కుండా, "మీ అమ్మాయా అండీ!" అన్నది ఆ యువతివేపు చూపించి.

ఆ అమ్మాయి ఇసుకవేపు చూస్తున్నదల్లా ఉలిక్కిపడి, తల తిప్పింది. కృష్ణమూర్తి చిరునవ్వు నవ్వాడు. చేతిలోవున్న స్పూను నోట్లోకి పోనిచ్చాడు. ఈలోగానే రేణుక మళ్లీ అడిగింది.

"అంటే—మీ కూతురా అని అడుగుతున్నానండీ" అన్నది.

"ఔనండి." అన్నాడు కృష్ణమూర్తి చిరునవ్వుతోనే.

బస్! రేణుక చప్పగా చల్లారిపోయింది. ఏమీ అర్థంకాక అయోమయంలో పడిపోయింది. తిరుగు ప్రశ్న లేకుండా ఐస్‌క్రీం తినేశారంతా.

కృష్ణమూర్తి సెలవుతీసుకున్నాడు. ఆ అమ్మాయి ముఖం జేవురించిందేమో చూదామని అనుకుంది రేణుక. కానీ చూడలేకపోయింది. కృష్ణమూర్తి ముఖుమాత్రం నవవికసితంగా, నిత్యోల్లాసంగావుంది.

వాళ్లు వెళ్ళగానే, సీతాలక్ష్మివంక తిరిగింది రేణుక. "అంతపెద్ద కూతురేమిటి అక్కయ్యా?"

సీతాలక్ష్మి నవ్వింది. "ఏమోమరి! నిన్ను ఏడిపించాలని అల్లా అన్నాడేమో. మరి ఆ పిల్ల కూడా ఏమీ తడబడలేదు." అన్నది.

ఇంటికి వచ్చిన తర్వాతకూడా ఎన్నివిధాలో వూహాలుచేసింది రేణుక. ఆ తర్వాత కొన్నిరోజులకి తెలిసింది ఆ సత్యం—కృష్ణమూర్తికి ఒక అన్నగారున్నారని, ఆ పిల్ల ఆయన కూతురని.

రేణుక ఆలోచించింది. ఆ లెఖ్ఖన తనకీ కూడా లత కూతురేగా? కానీ తను మాత్రం ఆమోదించలేక పోయింది ఆ సత్యాన్ని. ఛీ, ఎనిమిదేళ్ళ కూతురేమిటి అనుకుంది మనస్సులో.

కానీ—కానీ కృష్ణమూర్తి పద్ధెనిమిదేళ్ళ కూతుర్ని చిరునవ్వుతో భరిస్తున్నప్పుడు, తను ఎనిమిదేళ్ళ కూతుర్ని ఎందుకు భరించరాదు అని రేణుకకి ఏనాడూ తోచలేదు. అసలు, ఆమాట కొస్తే తోచదుకూడాను.

★